ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయం

- నేరుగా రైతులతోనే ఎగుమతులు
- కూరగాయల సాగుకు సబ్సిడీ
- ఉద్యాన పంటలతో రైతులకు సిరులు

భాకరాపేట: సంప్రదాయ పంటల సాగుతో నష్టాల బారిన పడుతున్న రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించి అధిక ఆదాయం పొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉద్యానవన శాఖ ద్వారా పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. అర్హులకు సబ్సిడీపై విత్తనాలు, నారు, మొలకలు అందిస్తోంది. మెరుగైన సాగునీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మధ్య తరగతికి చెందిన రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలను సబ్సిడీతో అందజేస్తోంది. దీంతో రైతులకు ఖర్చులు తగ్గి అధిక ఉత్పత్తి సాధిస్తూ అదనపు ఆదాయం లభిస్తోంది. చిన్నగొట్టిగల్లు ఉద్యానవన శాఖ డివిజన్ పరిధిలో 2019 నుంచి 2023 వరకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన రాయితీ పథకాలను రైతులు బాగా సద్వినియోగం చేసుకున్నారు. చిన్నగొట్టిగల్లు డివిజన్ పరిధిలోని రెండు మండలాల్లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వివధ పథకాల కింద 1464 మంది రైతులు 1932 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు. వారికి ప్రభుత్వం రూ.5,10,24,000లు ఖర్చు చేసింది. అలాగే రైతులు నీటి కుంటలు నిర్మించుకునేందుకు నిధులు ఇస్తోంది.

పండ్లు, పూల తోటల విస్తరణ పథకం

ఈ పథకం కింద చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో 195 మంది రైతులు 410 ఎకరాల్లో మామిడి, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అరటి తోటలు సాగు చేశారు. వారికి ప్రభుత్వం రూ.13 లక్షలు రాయితీ ఇచ్చింది. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ఎగుమతి చేసుకునేలా చర్యలు తీసుకుంది.

కూరగాయల పంటల అభివృద్ధి పథకం

కూరగాయల సాగులో భాగంగా రెండు మండ లాల్లో 430 మంది రైతులు 545 ఎకరాల్లో టమాట, వంగ, బీర, కాకర తదితర పంటలను సాగు చేస్తున్నారు. వారికి ప్రభుత్వం రూ.31.25 లక్షల రాయితీ ఇచ్చింది. రైతులు కూరగాయలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

మామిడి తోటల పెంపక పథకం

ఈ పథకంలో ముదురు మామిడి తోటల పునరుద్ధరణ, కొమ్మ కత్తిరింపులు, ఎరువుల వాడకానికి హెక్టారుకు 50 శాతం రాయితీతో రూ.17,500 చొప్పున ప్రభుత్వం రైతులకు అందిస్తోంది. ఈ పథకం కింద చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో 268 మంది రైతులు 221 ఎకరాల్లో పండ్ల తోటలను పునరుద్ధరించుకున్నారు. వారు సబ్సిడీ కింద రూ.38.70 లక్షలు పొందారు.



డ్రాగన్ ఫ్రూట్ సాగు

ప్యాక్ హౌస్‌లు

పంటల కోత అనంతరం ఉత్పత్తుల గ్రేడింగ్, నిల్వ, మార్కెటింగ్ తదితరాల కోసం ప్యాక్ హౌస్‌లను నిర్మించి ఇస్తోంది. రెండు మండలాల్లో 28 ప్యాక్ హౌస్‌లకుగాను రూ.56 లక్షలు ఖర్చు చేసింది.



మల్చింగ్ షీట్

రైతులకు కూలీల ఖర్చులు తగ్గించడంతో పాటు, ఎరువు పెట్టిన పంటకే అందేలా మల్చింగ్ షీట్ వేసేందుకు ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీ ఇస్తోంది. ఈ పథకం ద్వారా రెండు మండలాల్లో 257 మంది రైతులు 272 ఎకరాల్లో మల్చింగ్ షీట్‌లు వేసుకున్నారు. రూ.43.5 లక్షల రాయితీ పొందారు.



పూల సాగు

రెండు మండలాల్లో 26 మంది రైతులు 28.5 ఎకరా ల్లో బంతి, చామంతి, బండి మల్లెలు, కాగడా జాతు లకు పూలతోటలు సాగు చేస్తున్నారు. వారికి ప్రభు త్వం సబ్సిడీ కింద రూ.2 లక్షలు అందజేసింది.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు

రెండు మండలాల్లో మూడు రైతు ఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేసింది. రూ.123.75 లక్షలతో 11 రైతు ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రాలు నిర్మించింది. ఈ ఏడాది వీటి ద్వారానే రైతులు మామిడి పండ్లను ఇతర రాష్ట్రాలకు నేరుగా ఎగుమతి చేశారు.

డ్రిప్, స్ప్రింక్లర్లు, ఇరిగేషన్ పథకం కింద....

రెండు మండలాల్లో 255 మంది రైతులు 715 ఎకరాల్లో బిందు, తుంపర్ల సేద్యం చేపట్టారు. వారికి ప్రభుత్వం రూ.162.041 లక్షలు ఖర్చు చేసింది. వారు తక్కువ నీటితో ఎక్కువ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

ఉద్యాన వన శాఖ సహకారం అపూర్వం



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అందించిన సహకారం అపూర్వం. వివిధ పథకాల కింద పంటల సాగుతోపాటు ఉత్పత్తుల సేకరణ కోసం సబ్సిడీ కింద పెద్ద మొత్తం ఖర్చు చేస్తోంది. దీంతో ఉద్యాన వన రైతుల్లో చిరునవ్వులు చూస్తున్నాం.

–రాజారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం, అధ్యక్షుడు, ఎర్రావారిపాళెం

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంది



ప్రభుత్వం ఉద్యానవన రైతులకు అన్ని విధాలా ఆదుకుంది. రాయితీలు ఇవ్వడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టి విత్తనం విత్తినప్పటి నుంచి పంట మార్కెట్‌కు వెళ్లే వరకు అధికారుల ద్వారా విశేష సేవలు అందించింది.

–ప్రతాప్‌రెడ్డి, రైతు, చిన్నగొట్టిగల్లు మండలం

జోరుగా అమ్మకాలు



దళారులు లేకుండా ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రాల ద్వారా మామిడి కాయలు అమ్మకాలు చేపట్టాం. ఎప్పుడూ లేనంతగా ఎగుమతులు సాగించాము. అన్ని మార్కెట్ యార్డుల కంటే కిలోకు రూ.2 నుంచి రూ.8 వరకు లాభం అందుకున్నాం.

–చిట్టిబాబునాయుడు, కార్యదర్శి, రైతు ఉత్పత్తిదారుల సంఘం, ఎర్రావారిపాళెం

పథకాలను రైతుల్లోకి తీసుకెళ్లాం



ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించాము. చాలామంది లబ్ధిపొందారు. పంట దిగుబడులను సాధించి ఆర్థికంగాను అభివృద్ధి సాధించారు. కొద్ది పాటి నీటితోనే సాగు చేపట్టి అధిక ఆదాయాన్ని అందుకున్నారు.

–శివకుమారి, హార్టికల్చర్ అధికారి, చిన్నగొట్టిగల్లు

క్లుప్తంగా

వారపుసంతలో అన్నదానం



పాకాల: దామలచెరువులో శనివారం నిర్వహించిన వారపు సంతలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో రైతులు, వ్యాపారులు, ప్రజలకు అన్నదానం చేశారు. రైతులు తెల్లవారుజామునే సంతకు వచ్చి పస్తులు ఉంటూ తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు చూస్తుంటారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. వారు పస్తులు ఉండకుండా ఎమ్మెల్యే సొంత నిధులతో అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీ

పాకాల: స్థానిక పీహెచ్‌సీని శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులను డిస్‌ప్లేలో ఉంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ కె.ఆర్.శేఖర్‌రెడ్డి, డీఈఈ నాగసురేష్, ఏజీ ధనుంజయ, డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో నాణ్యమైన విద్య

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రభుత్వ స్కూళ్లలో ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ బోధనతో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని చంద్రగిరి జెడ్పీటీసీ చిలకూరి యుగంధర్‌రెడ్డి కొనియాడారు. ఆయన శనివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులే అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, ఎంఈవో లలితకుమారి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రుక్మిణి, రామ్మూర్తి, జ్యోతి ప్రసన్న పాల్గొన్నారు.

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

తిరుమల: శ్రీవారిని కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్ పటేల్ ఆదివారం దర్శించుకోనున్నారు. శనివారం తిరుపతికి చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తిరుపతి తాతయ్యగుంట అమ్మవారిని దర్శించుకోనున్నారు.

చంద్రగిరి సర్పంచుకు సత్కారం



సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న మోహిత్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా చంద్రగిరిలో అత్యధికంగా కొబ్బరి మొక్కలు నాటించిన సర్పంచ్ రూపను వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సత్కరించారు. ఆయన శనివారం చంద్రగిరిలోని ఆమె స్వగృహానికి చేరుకుని రూప దంపతులను సత్కరించి అభినందించారు. అనంతరం సర్పంచ్ తన జన్మదినం సందర్భంగా చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కల నాటారు.

మెరుగ్గా శ్మశానవాటికల నిర్వహణ

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని శ్మశానవాటికలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె శనివారం బాలాజీ కాలనీ శ్మశానవాటికను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.95 లక్షల తుడా నిధులతో బాలాజీ కాలనీలోని శ్మశానవాటికలో గ్యాస్ క్రిమియేషన్‌ను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులకు దూరం

తిరుపతి తుడా: అవగాహన కలిగి ముందు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు రాకుండా చూడవచ్చని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. రుయా ఆసుపత్రిలోని వయోవృద్ధుల వార్డులో శనివారం ప్రపంచ మెదుడు దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనిషి శరీర అవయవాల్లో మెదడు కీలకమైందన్నారు. మెదడు సంరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.రాజేశ్వరి మెదడు సంబంధిత వ్యాధుల గురించి వివరించారు. రుయా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రాధ, ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి పాల్గొన్నారు.

తిరుపతిలో బేబీ చిత్రం యూనిట్ సందడి



అభిమానులకు అభివాదం చేస్తున్న బేబీ చిత్రం యూనిట్ సభ్యులు

తిరుపతి కల్చరల్: బేబీ చిత్రం విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విజయోత్సవ యాత్రలో భాగంగా శనివారం రాత్రి చిత్ర యూనిట్ తిరుపతికి వచ్చింది. నటీ నటులు, సంధ్య థియేటర్‌లో అభిమానుల మధ్య సందడి చేశారు. ప్రేక్షకులు కేరింతలు కొడుతూ హోరెత్తారు. అనంతరం బేబీ చిత్రం దర్శకుడు సాయి రాజేష్ ఓ ప్రైవేట్ హోటల్లో మీడియాతో మాట్లాడారు. తాను పెట్టి పెరిగింది నెల్లూరు అయినా తనకు అత్యధికంగా మిత్రులు ఉన్న నగరం తిరుపతి అని తెలిపారు. తన దర్శకత్వంలో ప్రేమ కథాంశంగా రూపొందించిన బేబీ చిత్రం విడుదలై రెండో వారం కూడా విజయవంతంగా ప్రదర్శించడం సంతోషంగా ఉందని తెలిపారు. పది సెంటర్లలో నాన్ స్టాప్‌గా సాగుతూ ప్రేక్షకుల ఆదరణ పొందుతోందని, వాటిలో తిరుపతి ప్రథమ స్థానంలో ఉండడం మరింత ఆనందాన్ని ఇచ్చిందన్నారు. హీరోలు ఆనంద దేవకొండ, విరాజ్ అశ్విన్, హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ తాము నటించిన చిత్రాన్ని ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకొండపై విశేష పూజలు



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. కల్యాణ మండపంలో శ్రీవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

ప్రతి గడపలోనూ ఆత్మీయతే



సప్తగిరినగర్‌లో పర్యటిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి మంగళం: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మికి ప్రతి గడపలోనూ ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభిస్తోంది. ఆమె శనివారం మంగళం సప్తగిరినగర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణమ్మ ఆధ్వర్యంలో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకూ వెళ్లి తన భర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సర్పంచ్ లీలావతి, డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, పంచాయతీల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గుండ్రాజు శివశంకర్‌రాజు, ఉపసర్పంచులు ఉమాపతి, బైరెడ్డి రమేష్, ఎంపీటీసీ లక్ష్మయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మహ్మద్‌కాసీమ్ పాల్గొన్నారు.

చురుగ్గా మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు

తిరుపతి తుడా: మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె శనివారం మాస్టర్ ప్లాన్ రోడ్లు, రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అనుకున్న సమయానికి పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్ల విస్తరణతో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు అందజేయాలని ఆదేశించారు. సుందరీకరణ పనులను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి అభినయ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ 23వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి 30 వరకు మహతి కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్.రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పౌరాణిక, సాంఘిక నాటకాలు, నృత్య కళలను పరిరక్షించడంతో పాటు పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా జాతీయస్థాయి నాటక, నృత్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 8 రోజులు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు శాస్త్రీయ, జానపద బృంద నృత్య ప్రదర్శనలు, పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అలాగే మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 26, 27వ తేదీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు ఇస్తామని పేర్కొన్నారు. 28వ తేదీ సాయంత్రం బధిర విద్యార్థులకు వినికిడి యంత్రాలు ఇస్తామన్నారు. అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడు విశ్వం విద్యా సంస్థల అధినేత ఎస్.విశ్వనాథరెడ్డి, ప్రతినిధులు డి.విజయకుమార్ పాల్గొన్నారు.

మాదిగలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

తిరుపతి కల్చరల్: 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన మాదిగలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని మాదిగల జేఏసీ చైర్మన్ పి.సుబ్బయ్య డిమాండ్ చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాలోని 15 మాదిగ సంఘాల నేతలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.

ఇంటర్నల్ రోడ్ల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: ఎంఆర్ పల్లి పరిధిలో చేపట్టిన ఇంటర్నల్ రోడ్ల పనులను శనివారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో స్థానికులురాలు కున్నమ్మ మాట్లాడుతూ తమ ప్రాంతానికి దశాబ్దాలుగా సరైన రోడ్లు లేవని, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇప్పుడు తమ ప్రాంతానికి కొత్త రూపు వచ్చిందని పేర్కొన్నారు. నువ్వు చల్లగా ఉండాలి మనవడా.. అని దీవించారు. డీఈ మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు తిమ్మారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



తీర్థ యాత్రలో ఉన్న రామచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ముండ్లపూడి సర్పంచ్ సురేష్ రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి, ఆయన అభిమానులు



యోగిమల్లవరం కూడలి వద్ద రామచంద్రారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి



రామచంద్రారెడ్డికి చిత్రపటాన్ని బహుకరిస్తున్న అభిమానులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. యోగిమల్లవరం కూడలి వద్ద ఏఐటీయూసీ, ఆటో యూనియన్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, చిరు వ్యాపారులు, అభిమానులు ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి సతీమణి మధురెడ్డి ఆధ్వర్యంలో ఆశ్రయ ఆశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. సుమారు రూ.50 వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. సర్పంచ్ కార్యాలయం వద్ద సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఏఐటీయూసీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, మహిళా ఆటో నాయకురాలు భావన రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ రామచంద్రారెడ్డి తిరుచానూరు పంచాయతీని మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే మనసున్న నాయకుడన్నారు. కార్యక్రమంలో తిరుచానూరు అభివృద్ధి కమిటీ నాయకురాలు విజయలక్ష్మి, ఆటో యూనియన్ నాయకురాలు లక్ష్మి, శ్రీనివాసులు, సుమిత్ర, మస్తానమ్మ, నారాయణమ్మ, జ్యోతి, శాంతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.